
# అమ్మ

పుత్రేవు సీత




**ఆ రోజు ఎమ్ సెట్ ఫలితాలు ప్రకటించారు.**

**ఫలితాలు చూసి డాక్టర్ ఉమాభారతి ఆనందానికి అవధుల్లేక పోయాయి.**

పల్లవి పాసవటమే కాకుండా స్టేట్‌లో మూడవ ర్యాంకు తెచ్చుకుంది.

ఆ విషయం చెప్పటానికి ఇంట్లోకి వెళ్లింది ఉమాభారతి.

పల్లవి అప్పుడే స్నానం చేసి డ్రెస్ అప్ అయింది. లేత ఆకుపచ్చ మిడ్డీలో లేత చిగురుటాకులా నవనవలాడుతోంది. ఇప్పుడామెకు పదహారేళ్లు.

షోడశ వర్ష ప్రాయం ఆడపిల్లల జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టం. ఆమె దంతా తండ్రి పోలిక.

సన్నగా రివటలా ఉంటుంది. చలాకీతనం చెప్పనే అక్కర్లేదు. ఆమె ఎక్కడ ఉంటే అక్కడే సందడి.

అటువంటి కూతుర్ని కన్నందుకు గర్వంగా ఉంది ఉమాభారతికి. పల్లవి నోట్లో పంచదార పోస్తూ, " మీ రిజల్ట్సు వచ్చాయి, నీకు మూడవ ర్యాంకు వచ్చిందే'' అంటూ చెప్పింది సంతోషంగా.

దీన్నే ముహ్ మీఠా కర్‌నా అంటారు. అలా చేస్తే ముందు జీవితం మధురంగా ఉంటుంది.

పల్లవిలో కూడా ఆనందం మిన్నంటింది.

పట్టలేని సంతోషం వలన కళ్ల వెంట నీళ్లు తిరిగాయి. తన ఎత్తు కెదిగిన కూతురిని దగ్గరగా లాక్కుని, తల నిమురుతూ ఆమెను గాఢంగా గుండెలకు హత్తుకుంది ఉమాభారతి. ఆ పరిష్వంగంలో మాతృ వాత్సల్యం పొంగి పొర్లింది.

ఆ స్పర్శ 'ముక్తాహార కర్పూర సాంద్ర పరాగ ప్రసరం'వలె ఎంతో హృద్యంగా ఉంది.

పుత్రికా గాత్ర పరిష్వంగం కూడా అంత సుఖాన్ని ఇస్తుందేమో. ఒక్క క్షణం తల్లి గుండెల్లో తలదాచుకున్న పల్లవి, ఆమెను విడిపించుకుని, వంట ఇంట్లో ఉన్న వాళ్ల అమ్మమ్మ చెవిలో ఆ శుభవార్త వేసింది.

ఆ మాతామహి "నా తల్లే! నా తల్లే! పొద్దునే ఎంత మంచిమాట చెప్పావమ్మా'' అంటూ పొంగిపోయింది.

వెంటనే బుట్టలో నుంచి కొబ్బరికాయ తీసి "చింతామణి గణపతీ! తండ్రీ! నా మనవరాలికి నువ్వే దిక్కు. నిర్విఘ్నంగా దాని చదువు సాగేలా చెయ్యి తండ్రీ!'' అంటూ దేవుడి దగ్గర ఠక్కున కొట్టింది.

ఆమెకు దైవ భక్తి ఎక్కువ. ఎక్కువ అంటే సరిపోదు, అచంచలమైన భక్తి, అవ్యభిచారిణీ భక్తి. చింతామణి గణపతి చింతలు తీర్చి కోర్కెలు ఈడేరుస్తాడని ఆమె ప్రగాఢ విశ్వాసం. తన జీవితాన్ని కడతేర్చేవాడు కూడా ఆ గణపతేనని ఆమె నమ్మకం.

"నువ్వు తప్పకుండా పెద్ద డాక్టరువవుతావే తల్లీ ! నీ ముఖంలో ఆ కళ ఉంది'' అంటూ దీవించి, పిడికిళ్లతో మనవరాలి బుగ్గలు నొక్కి, "ఎంత దానివయ్యావే భడవ ఖానా!'' అంటూ పకపక నవ్వింది. నిష్కల్మమైన ఆమె నవ్వులో కూతురు, మనుమరాలు కూడా భాగస్వాములయారు. చింతామణి గణపతి అదృశ్య హస్తంతో వారిని ఆశీర్వదించాడు.

ఉమాభారతి వృత్తిరీత్యా డాక్టరు కాదు.

కాలేజీలో లెక్చరరు. జువాలజీలో డాక్టరేట్ పట్టా తెచ్చుకుంది. పల్లవి అదే కాలేజీలో ఇంటర్ చేసింది. పల్లవికి ర్యాంకు వస్తుందని అనుకున్నారు కాని, స్టేట్‌లోనే మూడవ ర్యాంకు వస్తుందని ఊహించలేదు. ఇదొక ప్లెజెంట్ సర్‌ప్రైజ్. యాదృచ్ఛికాహ్లాదం.

'క్లేశః ఫలేన హి పునర్నవతాం విధత్తే' అన్నాడు కాళిదాసు. ఫలించిన కష్టం కష్టమనిపించదు. పర్వతాన్ని అధిరోహించాక పడిన శ్రమనంతా మరచిపోతాం. అందుకే వారు ఎంతో ఉల్లాసంగా ఉన్నారు.

తన స్నేహితురాలి దగ్గరకు వెళ్లి తిరిగి వస్తున్న పల్లవి వాళ్ల ఇంటి ముందు ఆగి ఉన్న కారును చూసింది.

ఇంట్లోకి అడుగు పెట్టేసరికి డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూర్చుని తన తల్లి ఎవరితోనో మాట్లాడుతోంది.

పల్లవిని చూసి 'రా బేబీ! నీ కోసమే చూస్తున్నాం' అంది. 'మా అమ్మాయి పల్లవి' అంటూ తనను వారికి పరిచయం చేసింది. వీరు శ్రీధర్, "ఏ వన్ ట్యుటోరియల్స్" డైరక్టరు. ఈమె వారి సతీమణి శ్రీలక్ష్మి - ఆ కాలేజ్ ప్రిన్సిపాల్. అంటూ వారి గురించి వివరించింది.

పల్లవి తల్లి ప్రక్కనే కూర్చుంటూ " ఏ వన్ డ్రైక్లీనర్స్' అన్నట్లు ఏ వన్ ట్యుటోరియల్స్' ఏమిటి? నా తలకాయ" అనుకుంది.

"నువ్వు థర్డ్ ర్యాంకు తెచ్చుకున్నావని తెలిసి, నీకు అభినందనలు తెలుపటానికి వచ్చాం" అన్నారు డైరెక్టరు గారు.

"విష్‌యు ఎ బ్రిలియంట్ మెడికల్ కెరియర్' ' అన్నారు ప్రిన్సిపాల్.

పల్లవి వారిద్దరకూ నమస్కరించింది. ప్రిన్సిపాల్ గారు స్వీట్స్ పాకెట్ పల్లవికి అందించింది. "ఎందుకండీ ఇవన్నీ" అంటూ మొహమాట పడింది పల్లవి. వారు పాకెట్‌ను టీపాయ్ మీద ఉంచారు. శ్రీధర్ దంపతులు పల్లవితో వారి రాక లోని ఆంతర్యాన్ని వివరించారు.

"ఈ పట్టణంలో అమ్మాయి మూడవ ర్యాంకు తెచ్చుకున్నదంటే అది ఈ నగర వాస్తవ్యులమైన మా కెంతో గర్వకారణం"

"నీకు రెండు గిఫ్ట్ ఓచర్లు ఇస్తున్నాం. వీటిని తీసుకువెళ్తే 'మమతా టాప్' షోరూంలో 500రు. విలువ గల, నీకు నచ్చిన పంజాబీ డ్రెస్‌ను తీసుకోవచ్చును."

"అంతేకాకుండా నీకు వెయ్యిరూపాయల గిఫ్ట్‌చెక్ కూడా ఇస్తాం - నీ ఇష్టం వచ్చినప్పుడు దానిని ఎన్‌క్యాష్ చేసుకోవచ్చును."

"ఇవన్నీ మీరు నాకు ఇవ్వటం ఎందుకండీ?' ' అన్నది పల్లవి.

"ఆ పాయింట్ కే వస్తున్నాం. నీ గురించి చిన్న రైటప్ పబ్లిష్ చెయ్యాలని అనుకుంటూన్నాం.

"నీ పేరు, తల్లిదండ్రుల పేర్లు, వారి వృత్తి వివరాలు, నువ్వు చదివిన కాలేజీ, నీ హాబీలు, నీ హాల్ టికెట్ నెంబర్, నువ్వు ఎమ్‌సెట్‌కు ఎలా ప్రిపేర్ అయినదీ, క్లుప్తంగా రాస్తే, మేం దాన్ని పబ్లిష్ చేస్తాం" 'మేం కెమేరా కూడా తెచ్చాం . నీ కలర్ ఫోటోకూడా వేసి దాని కింద బ్రీఫ్ రైటప్ పబ్లిష్ చేస్తాం.'

'ఈ పబ్లిసిటీ అంతా మా ట్యుటోరియల్స్ తరపున చేస్తాం.'

"కానీ నీ నుండి మాకో చిన్న సహాయం కావాలి"

"చెప్పండి ! నేను చెయ్యగలిగిన దైతే తప్పకుండా చేస్తాను" అంది పల్లవి.

"ఏం లేదు. చాలా చిన్న విషయం. మేం పబ్లిసిటీ ఇస్తున్నప్పుడు నువ్వు మా ట్యుటోరియల్స్‌లో కోచింగ్ తీసుకున్నావని రాస్తాం.'

"అసలు ఎవ్వరూ అడగరనుకో! కాని రేపు ఒకవేళ ఎవరైనా నిన్ను అడిగితే, నవ్వు కాదనకూడదు. అంతే."

"దీని వల్ల మా కాలేజ్‌కి పేరు ప్రతిష్ఠలు వస్తాయి, నీ గురించి కూడా అందరమూ తెలుస్తుంది.

'నీకు పర్సనల్‌గా వచ్చే నష్టం ఏమీ ఉండదు.'

పల్లవి ఆలోచనలో పడింది.

గత మూడు సంవత్సరాల్లోనూ తన తల్లి తనను ఎలా ట్రైనప్ చేసిందో కళ్ల ముందు కదిలింది.

పదవ తరగతి నుండీ తన చదువు గురించి ఆమె ఎంతో శ్రద్ధ వహించింది. ఇంటర్‌కు వచ్చే సరికి ఆమె మరిన్ని జాగ్రత్తలు తీసుకుని చదివించింది. ఆమె క్లాసులో లెక్చర్స్‌కు ప్రిపేర్ అవటం, ఇంటి పనులు చేసుకోటం, తనకు ప్రతిరోజూ, ఉదయం సాయంత్రం ట్యూషన్ చెప్పటం, స్టడీ మెటీరయల్ తయారు చేయటం - నిజంగా ఇన్నేళ్లూ అష్టావధానమే చేసింది ఉమాభారతి.

జీవితాన్ని , నడవడికను తీర్చిదిద్దే ఎన్నో కమనీయమైన సూక్తులను వినిపిస్తూ, వారి అర్థాన్ని వివరిస్తూ పల్లవికి జీవితం పట్ల సరియైన దృక్పథం ఏర్పడేలా చేసింది. ఆమెకు ఆత్మస్థైర్యాన్ని నూరిపోసింది.

ఇది కేవలం ఎమ్‌సెట్ కోసం ఇచ్చిన తర్ఫీదు కాదు. భావి జీవితానికి వేసిన పునాది.

కూతురు పక్కనే కూర్చుంటూ, తెలియని అంశాలను బోధపరుస్తూ, ఆమె ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకుంటూ రెండు సంవత్సరాలు అహర్నిశలు కృషి చేసింది ఉమాభారతి. రాత్రి నిద్రపోకుండా టీ ఇచ్చేది. అర్ధరాత్రి ఆకలేస్తుందేమోననీ, పిల్ల నీరసడిపోతుందేమోనని, జామ్ రాసిన బ్రెడ్ స్లైసెస్ ప్లేట్లో పెట్టి పక్కనే ఉంచేది. తాగటానికి హార్లిక్స్ ఇచ్చేది. బలానికి మల్టీ వైటమిన్ మాత్రలు ఇచ్చేది.

రాత్రి నిద్ర ముంచుకు రాకుండా డైట్ కంట్రోల్ చేయించేది. కూతురు తినకుండా ఆమె మాత్రం ఎలా తింటుంది?

అందుకే ఉమాభారతి కూడా మితాహారం తీసుకునేది.

ఒకోసారి పల్లవి కునికిపాట్లు పడుతుంటే, తన మృదుహస్తంతో "బేబీ!" అంటూ మెల్లగా తట్టిలేపి టీ తాగించేది. టీతో పాటు బిస్కట్స్ తినిపించేది. అధైర్యపడవద్దని అసరమైనప్పుడల్లా హెచ్చరిస్తూ ఉండేది.

ఆ ఆవు కూర్చుంటె కూర్చుని, నిల్చుంటే నిల్చొని, నడుస్తే నడిచి, నందినీ ధేనువును ఏ విధంగా దిలీపమహారాజు వెన్నంటి సేవించాడో, అదే శ్రద్ధతో పల్లవిని నీడలా అనుసరిస్తూ, ఆమెకు చదువుకోటానికి తగిన సౌకర్యాలన్నీ అమర్చేది ఉమాభారతి. తల్లి కార్యదీక్ష పట్టుదల చూసేసరికి పల్లవిలో ఉత్తేజం కలిగేది.

ఈ మూడు సంవత్సరాలు ఇద్దరూ కఠోర తపస్సు చేశారు. అది ఒక యోగ సాధన. అందుకే పరీక్షా ఫలితాలు చూడగానే ఆమె పొందిన ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఆమె పొందిన ఆనందం, పంట చేతికి అందినపుడుకృషీవలుడు పొందే ఆనందం. మాటల్లో చెప్పలేని ఆనందం. అనుభవైకవేద్యమైన ఆనందం.

అహర్నిశలు నిర్విరామంగా కృషి చేస్తూ, కొవ్వొత్తిలా వెలుగుతూ, తనను విజయశిఖరానికి ఎక్కించిన తల్లికి తప్ప, మరొకరికి ఈ కీర్తి దక్కటానికి వీల్లేదు.

డబ్బు ఎరచూపి, 'సింహము పాలిసొమ్ము గోమాయువు కోరు చందమున' ఈ గౌరవాన్ని వాళ్ల కాలేజీకి ఆపాదించుకోవటానికి ప్రయత్నించటం అసమంజసం, అనైతికం.

అందుకే పల్లవి ఇలా స్పందించింది.

మా అమ్మ తప్ప నాకు మరొక గురువు లేరు.

"క్షమించండి! నన్ను అపార్థం చేసుకోవద్దు, మా అమ్మే నా విజయానికి కారణం. అందుకు నాకెంతో గర్వంగా ఉంది."

అంటూ తల్లిని కౌగలించుకుని బావురుమని ఏడ్చేసింది పల్లవి - పల్లవి స్తున్న లేడి డాక్టర్ పల్లవి.

## అనుమానం

"జయా.... నా ప్రేమనే అనుమానిస్తున్నావా...?" భారంగా అడిగాడు విజయ్.

" ప్రేమను నేనెందుకు అనుమానిస్తానూ?"

" మరి...?"

" నా అనుమానమంతా నీ మీదే!"

" ..!!"

అండే అనిత (చిత్తూరు)